అవ్వాతాతల కంటికి వెలుగు

- ఉచితంగా వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్స
- అవసరమైన వారికి కళ్లజోళ్ల అందజేత

దెందులూరు: వైద్య సేవలు పొందడానికి పేదరికం అడ్డుకారాదని కంటి సమస్యలున్న ప్రతి ఒక్క రూ ప్రభుత్వం వైద్యశాలల్లో నాణ్యమైన వైద్యం ఉచితంగా పొందేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కంటి వెలుగు పథకం అవ్వాతాతల పాలిట వరంగా మారింది. వయస్సుతో సంబంధం లేకుండా కంటికి సంబంధించి అన్ని సమస్యలకు ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా పరీక్షలు, వైద్య సేవలు అందిస్తున్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు పథకం లబ్ధిదారులు

మండలం	లబ్ధిదారులు
దెందులూరు	3,301
పెదవేగి	7,049
పెదపాడు	2,197
ఏలూరు రూరల్	5,885



మహిళకు కళ్లజోడు పెడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి (ఫైల్)



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆధునిక, సాంకేతిక పరికరాలను వైద్యశాలల్లో ఏర్పాటు చేశారు. దీంతో బాధితులు ప్రైవేట్ వైద్యశాలల వైపు చూడకుండా ప్రభుత్వ వైద్యశాలల్లో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. కంటికి సంబంధించిన సమస్యలతోపాటు, కళ్లల్లో పువ్వు లు, నరాలు పాక్షికంగా, అధికంగా దెబ్బ తినడం, తలపోటు వంటి వాటికి సంబంధించి వైద్య పరీక్ష లు, చికిత్స డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో ఉచితంగా అందిస్తున్నారు.

ఉచితంగా కళ్లజోడు ఇచ్చారు



నాకు కంటి చూపు సమస్య ఉండేది. దీంతో స్పష్టంగా ఏ వస్తువు కనిపించక ఇబ్బంది పడ్డాను. ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకున్నాను. పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోడు ఇచ్చారు. ఇప్పుడు చూపు బాగా కనబడుతోంది.

– మానుకొండ భూక్యమ్మ

మెరుగైన చికిత్స అందుతోంది



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం వైద్యశాలల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. పెద్ద ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే పరిస్థితి ఇప్పుడు లేదు. ఖరీదైన వైద్య పరీక్షలుచేసే పరికరాలు ప్రభుత్వ వైద్యశాలల్లో ఏర్పాటుచేశారు. చాలా సంతోషంగా ఉంది.

– కేతవరపు రాజేశ్వరి

ఉచితంగా ఆపరేషన్ చేశారు



చూపు సరిగ్గా కనపడకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాను. ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం నాకు ఎంతో ఉపయోగపడింది. ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు, కళ్ల జోడు ఇచ్చారు.

– పద్మావతి పుల్లయ్య

ఇంటికి వచ్చి కళ్లజోడు ఇచ్చారు



నేను ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి కంటిపరీక్ష లు చేయించు కున్నాను. పరీక్షల అనంతరం నెలరోజుల తర్వాత ఆస్పత్రి నుంచి ఫోన్ చేశారు. వైద్య సిబ్బంది నేరుగా ఇంటికి వచ్చి నాకు కళ్లజోడు అందజేశారు. పేదలకు ప్రభుత్వపథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– పరసా రాటాలు

వలంటీర్ల సేవలను ప్రజలకు దూరం చేసిన చంద్రబాబు

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: అవ్వాతాతలను, దివ్యాంగులను, అంధులను ఇబ్బందిపెడుతున్న చంద్రబాబు పార్టీ శ్రేణులకు పుట్టగతులుండవని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మె ల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు సంతోషంగా ఉంటే చూడలేని చంద్రబాబు నైజం మరోసారి బయటపడిందన్నారు. వాళ్లే ఫిర్యాదు చేసి అవంతరాలు సృష్టించి జగనన్నపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. 40 రోజుల్లో టీడీపీ కుతంత్రాలు అంతమవుతాయని, జగనన్న నాయకత్వంలో ప్రజలకు అందుతున్న సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధిని తట్టుకోలేక టీడీపీ నీచ రాజకీయాలకు దిగజారుతోందన్నారు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసి వలంటీర్ల సేవలను ప్రజలకు దూరం చేశారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. 40 రోజుల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు వస్తాయని ఎమ్మెల్యే అన్నారు.

సుందరయ్యకు ఘన నివాళి

పెదవేగి : చక్కటి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి సుందరయ్య లేని లోటు తీరనిదని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. పెదవేగి మండలం విజయరాయికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు ఈడుపుగంటి నాగభూషణం(సుందరయ్య) గుండెపోటుతో సోమవారం మరణించగా ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కొఠారు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

క్లుప్తంగా

పోతునూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నున్నా ఆశీర్వాదం



పోతునూరు వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీ

దెందులూరు: పోతునూరు గ్రామ వైఎస్సార్ సీపీ నూతన కమిటీని సోమవారం నియమించడం జరిగిందని పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నున్నా ఆశీర్వాదం, వైస్ ప్రెసిడెంట్లుగా బత్రాజు సత్యనారాయణ, బుద్ధా అర్జున, కార్యదర్శిగా నున్నా ఫణీంద్ర, గౌరవ సలహాదారులుగా బీశెట్టి నూకరాజు, కడగళ్ల రంగారావు, మరో 18 మంది సభ్యులను ఎన్నుకున్నట్టు నాని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోదుల స్వరూప్, పార్టీ సీనియర్ నాయకులు, సొసైటీ మాజీ చైర్మన్ డీఎస్‌వీడీ ప్రసాద్ (బజ్జి), మండల నాయకులు నిట్టా గంగరాజు, ఎంపీటీసీ నున్నా నరేష్ ఉన్నారు. అనంతరం నూతన కమిటీని మండల నాయకులు అభినందించారు. పోతునూరులో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గంజి ప్రకాష్ (లాయర్) కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏసుక్రీస్తు సువార్త మహాసభలు ప్రారంభం



దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో ప్రారంభమైన సువార్త మహాసభలు

దెందులూరు: దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో సోమవారం మూడు రోజులు పాటు కొనసాగనున్న మన్నా చర్చి ఏసుక్రీస్తు సువార్త మహాసభలు ప్రారంభమయ్యాయి. పాస్టర్ బెంజిమన్ ఏసుక్రీస్తు సువార్త మహాసభలను ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

భీమ నాగలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: గాలాయగూడెంలో అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఆలయ ఆవరణలోని భీమ నాగలింగేశ్వరస్వామి 6వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. తొలుత స్వామికి వివిధ పుష్పాలతో విశిష్ట అలంకరణ, పూజలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం, అన్నదానం నిర్వహించారు.

216 మందికి చీరల పంపిణీ

దెందులూరు: మండలంలో 216 మంది ముత్తైదువులకు మండల రామదండు కమిటీ ఒకే రంగు కలిగిన చీరలను పంపిణీ చేశారు. ఉగాది రోజున గంగానమ్మ అమ్మవారికి 216 మంది మహిళలతో కలశాభిషేకం చేసేందుకు రామదండు కమిటీ నిర్ణయించి 216 మందికి చీరలు పంపిణీ చేశారు.

చంద్రబాబుకు ఎన్నికల్లో తడాఖా చూపుతాం



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నేత నల్లమిల్లి నాగరాజు, పాల్గొన్న సభ్యులు

భీమడోలు: డ్రైవర్లను విమర్శించిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో తమ తడాఖా చూపుతామని ఆటో యూనియన్ నేత, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి నాగరాజు అన్నారు. శింగనమల వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును ప్రకటించడాన్ని గేలిచేస్తూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను పూళ్లలో సోమవారం నిర్వహించిన సమావేశంలో డ్రైవర్లు తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంతో శాసనసభలో వీరాంజనేయులు అడుగుపెట్టడం ఖాయమన్నారు. ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, నాయకులు ఓగిరాల చంద్రం, చిన్నం వెంకటేష్, పెద్దిరెడ్డి భోగయ్య పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: పెదపాడులో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు సోమవారం తెలిపారు. తోటగూడెం వైపు నుంచి పెదపాడు కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహన డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై వీ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసిన పోలీసులు ముగ్గురు వ్యక్తులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.48,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ చెప్పారు.

న్యాయం చేయాలని పింఛన్‌దారుల ఆవేదన

లబ్ధిదారుల కన్నీటి పర్యంతం

దెందులూరు: చంద్రబాబు, ఆపార్టీ అనుచరులు కలిసి పెన్షన్లు రానివ్వకుండా అడ్డుకోవడం దారుణమని, కదల్లేని పరిస్థితుల్లో ఉన్న తాము పింఛను కోసం సచివాలయాలకు వెళ్లగలమా సానిగూడెం దళిత వీధిలో ప్రత్యేక అవసరాలు గల బాధితులు కళ్లెం దుర్గ (25), కళ్లెం దేవి (22) అన్నారు. సోమవారం ప్రతి నెల 1వ తేదీ మాదిరిగానే పెన్షన్లు వస్తాయని ఎదురుచూశామని వారన్నారు. వలంటీర్లు వచ్చి పెన్షన్లు ఇవ్వకుండా చంద్రబాబు, మరికొందరు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారని టీవీల్లో చూసి తట్టుకోలేకపోతున్నామన్నారు. తమలాంటి వారు వివిధ కారణాల వల్ల మంచంపైనే ఉంటూ బాధపడుతున్న ఎంతో మంది ఉసురు పెన్షన్లు ఆపిన వారికి ఖచ్చితంగా తగులుతుందని వారు కన్నీటిపర్యంతమయ్యారు. సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వేము ఫ్రాన్సిస్ వారిని ఓదార్చారు. వీరిద్దరి విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామని, కనీస అవసరాలు గలవారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ విష్ణు అన్నారు.



ప్రత్యేక అవసరాలు గల బాధితులను ఓదారుస్తున్న సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ (విష్ణు), ఫ్రాన్సిస్

గ్రామస్తులు, దళితుల ఆగ్రహం

ప్రతి నెల 1న తెల్లవారుజామున 5.30 గంటలకు వలంటీర్లు ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చేవారని, చంద్రబాబు చేయించిన పనికి దుర్గ, బేబీతో పాటు వృద్ధులు, వికలాంగులు, అంధులు, ప్రత్యేకావసరాలు గల బాధితులు నరకయాతన అనుభవిస్తున్నారని సానిగూడెం దళితులు, గ్రామస్తులు చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కోర్టు, ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించాలని కోరారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ మేలు

దెందులూరు: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా పేద,బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కోరారు. సోమవారం ఆమె పోతునూరులో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి, సర్పంచ్ బోదుల స్వరూప్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్నా ఆశీర్వాదం, ఎంపీటీసీ నున్నా నరేష్, మాజీ సొసైటీ చైర్మన్ డీఎస్‌వీడీ ప్రసాద్ (బజ్జి)తో కలిసి నేను సిద్ధం- మా ఊరు సిద్ధం కార్యక్రమంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని లబ్ధిదారులకు వివరించారు. రెండు ఓట్లను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌కు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు గూడపాటి పవన్‌కుమార్ పార్టీ సీనియర్ నాయకులు బీశెట్టి నూకరాజు, నున్నా ఆశీర్వాదం, మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ, నున్నా ఫణి, నాయకులు, రమేష్, బుద్ధా అర్జున, బత్రాజు సత్యనారాయణ, బోదుల రవి, వాసే డొమినిక్ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోతునూరులో ప్రచారంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నాయకులు

స్వచ్ఛంద సేవకులు వలంటీర్లపై పచ్చ పగ

గణపవరం: ప్రజలకు నిస్వార్థంగా, నిబద్ధతతో సేవలందిస్తున్న వలంటీర్ల వ్యవస్థపై పచ్చ పార్టీ, దాని తోక పార్టీలు, పచ్చమీడియా ముప్పేట దాడి చేసి వారి సేవలను ప్రజలకు దూరం చేశాయని, వీరికి ప్రజ ల చేతిలో పరాభవం తప్పదని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లా డుతూ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారికి తలలో నాలుకలా మారిన వలంటీర్లను ప్రజలకు దూరం చేయాలన్న నాలుగేళ్ల వారి దుష్టపన్నాగాలు ఎన్నికల నిబంధనల పేరుతో ఇప్పటికి నెరవేరాయన్నారు. తెలుగుదేశం దాని అనుబంధ ముఠాల చర్యలకారణంగా ప్రతినెలా 1న తెల్లవారు జామునే పింఛను అందుకునే అవ్వాతాతలు, ఇతర వర్గాలు తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్ల వ్యవస్థపై నిరంతరం విషం చిమ్మే పచ్చ పత్రికలు ఈరోజు వలంటీర్లను విధుల నుంచి తప్పించడం ప్రభుత్వ కుట్రేనని, దీనిని తెలుగుదేశం పార్టీపై నెట్టడానికి కుట్ర పన్నిందంటూ అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. లక్షల మంది వలంటీర్ల సేవలు నిలిచిపోవడం దురదృష్టకరమని వాసుబాబు అన్నారు. కరోనా కష్టకాలంలో అన్నీతామై వలంటీర్లు ప్రాణాలను పణంగా పెట్టి అందించిన సేవలు రాష్ట్ర ప్రజలెవ్వరూ మరచిపోరన్నారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వానికి మంచిపేరు రావడం తెదేపాతో పాటు ప్రతిపక్ష పార్టీలకు, పచ్చమీడియాకు రుచించడం లేదని ఆయన అన్నారు. ఎన్నికల కమిషన్ విషయం పునఃపరిశీలన చేసి 70 లక్షల మంది పింఛనుదారులకు న్యాయం జరిగేలా వలంటీర్ల సేవలను కొనసాగించేలా అనుమతించాలని వాసుబాబు విజ్ఞప్తి చేశారు. ప్రజలతో మమేకమైన వలంటీర్ల వ్యవస్థపై పగపట్టిన టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలన్నీ రద్దు చేయడం ఖాయమని స్పష్టమవుతోందని వాసుబాబు అన్నారు.



పుప్పాల వాసుబాబు

నెల రోజుల పాటు పాతూరు గేటు మూసివేత

భీమడోలు: రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేసే పాతూరు రైల్వే గేటును రైల్వే అధికారులు సోమవారం సాయంత్రం నుంచి మూసివేసారు. రైల్వే శాఖ సింగిల్ గేటుమెన్లు ఉన్న రైల్వే గేటులను మూసివేసే ఆలోచనలో భాగంగా సూరప్పగూడెం, పాతూరు గ్రామాలను అనుసంధానం చేసే 358 పాతూరు రైల్వే గేటు అండర్ పాస్ నుంచి రోడ్డు వరకు నిర్మాణ పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత రైల్వే అధికారులు చెబుతున్నారు. ఈ పనులు ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతాయి. అప్పటి వరకు గేటు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు, ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

దెందులూరు: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏలూరు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ద్వారా 30 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు ఫ్యాకల్టీ శిరోమణి తెలిపారు. బ్యూటీ పార్లర్ కోర్సు, ఫొటోగ్రఫీ, వీడియో మిక్సింగ్ కోర్సుల్లో 30 రోజులపాటు గ్రామీణ ప్రాంత యువతీ, యువకులకు శిక్షణనిస్తామన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన, పరీక్షలకు హాజరైనవారికి ఈ నెల 2 నుంచి ఏలూరులో ఉచిత శిక్షణ, వసతి, భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. 9502723561, 9948565256 ఫోన్ నంబర్ల ద్వారా ఆసక్తి గల యువతీ యువకులు నమోదు చేసుకోవాలని ఫ్యాకల్టీ శిరోమణి తెలిపారు.

పేద సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

భీమడోలు: పేద సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన సాగించారని, పేదలకు మేలు చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు అండ్ కో కుట్రలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు కొత్తపేటలో సోమవారం మా ఊరికి వాసన్న కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. వాసుబాబు ఇంటింటికీ వెళ్లి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రామకుర్తి నాగేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు వాసుబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాస్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట రంగా, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల ఇన్‌చార్జి పుప్పాల కార్తీక్, రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీటీసీలు గొందు కృష్ణచైతన్య, గంటా శ్రీనివాసరావు, పొల్నాటి శ్రీను, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి వగ్వాల అచ్యుతరామారావు, ముళ్లగిరి జాన్సన్, పసుపులేటి సత్యనారాయణ, రామకుర్తి నాగేశ్వరరావు, సీహెచ్‌సీ చైర్మన్ చింతా శ్రీరామచంద్రమూర్తి, మద్దుల రాజా, పులిచర్ల వెంకటకృష్ణారావు, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్, కోడూరుపాడు సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు, జిల్లా ఎస్సీసెల్ జాయింట్ కార్యదర్శి అంబటి నాగేంద్ర ప్రసాద్, నాయకులు పుప్పాల రామ్మోహనరావు, పట్నా బాబీ, పులఖండం మధు, ఐ బాబు, కేతినీడి విశ్వేశ్వరరావు, బొల్లారపు పవన్‌కుమార్, ఎండా రవి, పుప్పాల బుజ్జులు, కందులపాటి మురళీ, రామిశెట్టి శ్రీనువాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరులో ప్రచారం

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఉంగుటూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వీవర్సు జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, సచివాలయాల కన్వీనర్ పి.బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు సందక రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంద జయలక్ష్మి, చల్లాలమ్మ ట్రస్టీ బోర్డు మాజీ చైర్మన్ దూసనపూడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

భీమడోలు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ సోమవారం కురెళ్లగూడెం, అంబర్‌పేటలో కళాజాత బృందం కళాకారులు బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఏలూరు కీర్తన కల్చరల్ సొసైటీ బృందం నాయకులు యడవల్లి కృష్ణ ప్రసాద్, చిరంజీవి స్వీప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బలమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించేందుకు అర్హులైన పౌరులందరూ ఓటు వేయాలని కోరారు. సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు అందించాలన్నారు. ఎంపీడీవో టి.స్వర్ణలత, ఈవోఆర్‌డీ ఏ.సుందరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కురెళ్లగూడెంలో ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

బహిరంగ ప్రకటన

గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం



పెదపాడు: వీరమ్మకుంటలో ఓటర్లకు పథకాలు వివరిస్తున్న అక్కినేని రాజశేఖర్ తదితరులు



దెందులూరు: గోపన్నపాలెం, గాలాయగూడె వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేస్తున్న కామిరెడ్డి నాని

పెదపాడు: జగన్నను మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంట శివారు వెంకటాపురంలో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాలను వివరించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసారని గుర్తుచేసారు. మరలా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు పూడి రంగప్పారావు, ఎంపీటీసీ పూడి అప్పలస్వామి పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

దెందులూరు: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు సోమవారం మండలంలో గోపన్నపాలెం, గాలాయగూడెంలో నాయకులతో కలిసి పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని నేను సిద్ధం- మా ఊరు సిద్ధం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన సమావేశంలో నాని మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ళల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ వివరాలను గడపగడపకూ వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు వెళ్లి వివరించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ ఘన విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు సువ్వా ప్రభుదాసు, ఏనుగు అంజలి ప్రసాద్, నాయకులు కొండేటి గంగాధరబాబు, తోట పద్మారావు, మాగంటి కృష్ణమోహన్, వీరంకి సత్యనారాయణ, మొర్ల సుబ్బారావు, రామాంజనేయులు, పసుమర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు. గాలాయగూడెంలో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీలు సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు, గంటా సుబ్బారావు, మరీదు రాజా, వార్డు మెంబర్లు రాజీవ్, శ్రీధర్, నాయకులు అంబటి లక్ష్మణరావు, పెద్దిశెట్టి బసవయ్య, బోయపాటి గణేష్, సాంబశివరావు, మునునూరి వెంకటేశ్వరరావు, మొటపర్తి గాంధీ, తోట వెంకన్న, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.